www.prajasakti.com


ప్రజాశక్తి

శనివారం 17 ఫిబ్రవరి 2024 5 తూర్పుగోదావరి



నోటీసులతో ఉద్యమాలను ఆపలేరు

తాళ్లపూడి : నోటీసులిచ్చి ఉద్యమాలను ఆపలేరనీ ఒపిఎస్ సాధన సమితి జిల్లా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. ఈనెల 18న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పిలుపు మేరకు 'చలో విజయవాడ'కు వెళ్లరాదంటూ పోలీసులు ఆయనకు శుక్రవారం నోటీసులు అందించారు. చలో విజయవాడ వల్ల శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని నిఘా వర్గాల నుంచి సమాచారం ఉందంటూ తూర్పుగోదావరి జిల్లా పోలీసు విభాగం నుంచి ఈ నోటీసు అందించారన్నారు.



జోడాలకు నోటీసు ఇస్తున్న పోలీసు

మోడీ కూటమిని గద్దె దించుదాం

- జిల్లాలో గ్రామీణ బంద్, కార్మికుల సమ్మె జయప్రదం
- పలుచోట్ల కార్మికులు, రైతుల నిరసన ర్యాలీలు
- మద్దతుగా పాల్గొన్న ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, యంత్రాంగం

మోదీ కూటమిని గద్దె దించుదాం... దేశాన్ని కాపాడుకుందాం... అంటూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ బంద్, సమ్మె జరిగింది. రైతులు, వివిధ పరిశ్రమల్లో కార్మికులు, రవాణా రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో కార్మికులు, రైతుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. కోటిపల్లి బస్టాండ్ వద్దగల హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి శ్యామల సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా కోటగుమ్మం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కొటగుమ్మం సెంటర్‌లో జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎవి.రమణ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు దోచిపెట్టారన్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా చట్టబద్ధం చేసి రూ.6,500కోట్లను కార్పొరేట్ల నుంచి విరాళాలుగా పొందిందన్నారు. దానికి ప్రతిఫలంగా కార్పొరేట్లకు కావాల్సిన చట్టాలు, విధానాలను రూపొందించి దేశ సంపదను మొత్తం కట్టబెట్టిందని విమర్శించారు. రైతులకు కనీసం మద్దతు ధర అమలు మరిచారన్నారు. రైతు చట్టాల పేరుతో భూములను మొత్తం కార్పొరేట్లకు దోచి పెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ, బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా లక్షల కంపెనీలు మూతపడి కోట్లాది మంది కార్మికుల రోడ్లపాలయ్యారని విమర్శించారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో నాలుగేళ్ల ఉద్యోగం, 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా చేసిందన్నారు. దేశంలో 80 శాతంగా ఉన్న పేదలపై పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకులు, కరెంటు ఛార్జీల భారాలు మోపిందన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి అల్లర్లు సృష్టిస్తుందన్నారు. రవాణారంగం పూర్తిగా కుదేలైందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనంత దారుణంగా రవాణారంగంలో జరిమానాలున్నాయన్నారు. రోడ్ సేఫ్టీ బిల్లు సవరణలు తీసుకొచ్చి రవాణా రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు పూనుకుందన్నారు. రవాణా కార్మికులకు తక్షణం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, నాయకులు వీ రాంబాబు, అప్పల నరసయ్య, వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు సప్ప రమణ, నల్ల రామారావు మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, నాయకులు కెఎస్‌వి.రామచంద్రరావు, ఎస్ఎస్.మూర్తి, ఎం.వెంకటలక్ష్మి, కె.అన్నామణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇ.భాస్కర్, ఎన్.రాజా ఎఐటియుసి జిల్లా నాయకులు కొండలరావు, నల్లా రామారావు, రామకృష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కె.జోజి, సిహెచ్.శివ, పిట్టా నరసింహమూర్తి, కె.లాజర్, డి.శ్రీనివాసరావు, ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు కొవ్వూరు కమిటీ ప్రధాన కార్యదర్శి బీరా రవి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతుల, కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. పైగా రైతాంగ, కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి అంగన్‌వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.నాగేశ్వరరావు, మాణిక్ రెడ్డి, హరిబాబు, జట్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఉడతల సత్యనారాయణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భూపతి రవీంద్ర పూజారి వాసు కళ్యాణి రాజేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు శాకా పుల్లారావు మద్దతు తెలిపారు. **చాగల్లులో** కార్మికులు, రైతులు ర్యాలీ నిర్వహించారు. మూతపడిన సుగర్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.పోసమ్మ, రైతు, కౌలు సంఘం జిల్లా నాయకులు గారపాటి సుబ్బారావు, జుజ్జవరపు శ్రీను, మండల నాయకులు కె.దుర్గారావు, ఎస్‌కె.ఆదామ్, రమేష్ మాట్లాడారు. కౌలు, రైతు సంఘం, సిఐటియు అనుబంధ యూనియన్ల నాయకులు, కార్మికులు, హమాలీలు, మిడ్డే మీల్స్ కార్మికులు పాల్గొన్నారు. **పెరవలిలో** రైతు కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. బ్యాంకులు, పోస్టాఫీసులను మూయించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.జ్యోతిరాజు, పాల్గొన్నారు **గోపాలపురం** మండలం దొండపూడిలో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సమ్మె విజయవంతమైందని ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కురసం లత తెలిపారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. **దేవరపల్లిలో** ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో సిఐటియు మండల కార్యదర్శి భగత్ మాట్లాడారు. మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్కా శ్రీనివాసు భూదేటి రామచంద్రం, ట్యాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు పాముల శ్రీనివాసు, ఎఐటియుసి కార్యదర్శి ఆచంట సత్యనారాయణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మల్లెపూడు వెంకటలక్ష్మి, మిడ్డేమీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.రాజకుమారి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు గుంటూరు వరలక్ష్మి, గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, గేలం సత్యనారాయణ, వి.దుర్గారావు పాల్గొని మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు అంగన్‌వాడీలు మద్దతు తెలిపారు. **రాజానగరం** అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జోగు జగన్నాథం రావు ఆధ్వర్యంలో బహదూర్ అన్నదాన సత్రం నుంచి సాయిబాబా గుడి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు జె సత్తిబాబు మాట్లాడారు. మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, దొమ్మ సీత, గోరచ దుర్గ, పాల్గొన్నారు. **కడియంలో** అన్నదాతలు, కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల బంద్, సమ్మెకు అంగన్‌వాడీలు మద్దతు తెలిపారు. దేవి చౌక్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కె.బేబిరాణి, వై.సుజాత, కె.ఏడుకొండలు, పి.సుజాత, ఎం.వీరమణి, పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **సీతానగరంలో** సిఐటియూ జిల్లా నాయకులు పవన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, విఆర్ఎలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తదితర కార్మికులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో కార్మికులు, రైతుల ర్యాలీ



సీతానగరంలో..



కొవ్వూరులో..

'జగనన్న పాల వెల్లువ'పై గ్రామసభ

ప్రజాశక్తి - చాగల్లు

జగనన్న పాల వెల్లువపై మండలంలో చంద్రవరం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మద్దిపాటి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎంపిఎం మంగయమ్మ, వెటర్నరీ డాక్టర్ యు.ముఖేష్ పాల్గొని అవగాహన కల్పించారు. గ్రామంలోని పాడి రైతులు హాజరయ్యారు.

ఎఎన్ఎంలతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ నాతి బుజ్జి ఎఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఎన్ఎంలతో స్కూల్స్ విజిట్‌పై రివ్యూ నిర్వహించారు. స్కూల్స్ విజిట్ చేసినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఎఎన్ఎంలు పాల్గొన్నారు

50 మంది టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని 50వ డివిజన్‌లో శుక్రవారం వీరపనేని భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వంక చిన్ని, వజరపు భరత్‌కుమార్‌లతో పాటూ 50 మంది టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం డివిజన్‌లో నిర్వహించిన భవిష్యత్తుగా గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నగర కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

స్వీప్ నోడల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఓటర్లలో చైతన్యం, ఎన్నికల్లో భాగస్వామ్యం లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని స్వీప్(ఎస్‌విఇఇపి) నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో స్వీప్ నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ ద్వారా ఓటర్ల వద్దకు చేరాల్సి ఉంటుందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత తెలియజేసి ఓటు వేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం చాలా ముఖ్యమన్నారు. ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడమే స్వీప్ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. అర్హత కలిగిన పౌరులను ఓటర్లుగా నమోదు చేయడంలో ఉన్న అంతరాలను అధిగమించడం కోసం నిర్దిష్ట ప్రణాళిక తప్పనిసరి అన్నారు. స్వీప్ కార్యకలాపాల గురించి టైమ్ లైన్స్ నిర్దేశించుకుని, సమన్వయం చేసుకొవాలని స్పష్టం చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఓటరు నమోదు నుంచిపట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లలో ప్రచార కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రచార కార్యక్రమాల్లో వినూత్న ఆలోచనలకు సృజనాత్మకతను జోడించి ప్రతిపాదనలతో రావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా పాఠశాల విద్యా అధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఎ ప్రాజెక్ట్ అధికారి ఎస్.సుభాషిణి, ఆర్ఎంసి వైద్యాధికారి వి.వినూత్న, డిప్యూటీ డిఇఒ ఇ.నారాయణరావు, కలక్టరేట్ ఎన్నికల సిబ్బంది సునీల్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జోడాల తదితరులు

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో ఈ నెల 18న నిర్వహించనున్న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పాత పెన్షన్ అమలు చేయాలంటూ సుమారు ఇరవై సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. ఈ కారణంగా చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు. దీనికి సంధించిన పోస్టర్‌ను తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద జోడాల శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిటి దివాకర్, ఆర్ఐ కిషోర్, జూనియర్ అసిస్టెంట్ దీపక్, వార్డెన్ వినోద్, విఆర్ఒ సంజీవరావు, విఆర్ఎ సురేష్, శ్రీలక్ష్మి, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అనూష ఎంపిక

ప్రజాశక్తి-గోపాలపురం

ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి పోటీలకు గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపల్ టి.ఉమాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిజిటిఎం పాఠశాలలో జరిగిన ఇన్‌స్పైర్ ప్రదర్శనలో ఎస్.అనూష ఐబ్లింక్ సెన్సార్ కమ్ యాక్సిడెంట్ కంట్రోల్ అనే ప్రాజెక్టును ప్రదర్శించిందన్నారు. ఎం.లిఖిత వైల్డ్ లాండ్ అర్బన్ ఇంటర్ పేస్ డిటెక్షన్ ఆఫ్ ఫైర్ అనే ప్రాజెక్టును ప్రదర్శించిందన్నారు. అనూష ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. ఈ సంరద్భంగా అనూషను ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్షేత్ర స్థాయిలో మెడిసిన్ అడాప్షన్ కార్యక్రమం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రథమ సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు శుక్రవారం మెడిసిన్ అడాప్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.సమాజ పరిచయం, సమాజములో నెలకొనియున్న వివిధ ఆరోగ్య పరిస్థితులు వాటిపై ఆధారపడియున్న ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించే విధంగా జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థానిక వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి దిశా నిర్దేశం మేరకు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.శివప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ వివి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్య విద్యార్థులు వారికి కేటాయించిన కుటుంబాలను కలవాలన్నారు. వారి ఆహార, ఆర్థిక, ఆరోగ్య, సామాజిక స్థితిగతులను సేకరించి వారిని చైతన్యవంతులు చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ కార్యక్రమము ద్వారా సమాజంలో ప్రజల ఆరోగ్య అవసరాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ వివి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్నమాచారి రోడ్, దుర్గా నగర్, వాంబే కాలనీల పరిధిలో ఉన్న అర్బన్ ఏరియాల్లో ఒక్కొక్కరికి ఐదు కుటుంబాలను కేటాయిస్తారన్నారు. ఆయా కుటుంబాల ఆరోగ్యభద్రతను విద్యార్థులు చూడాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వివి.దుర్గాప్రసాద్, సమన్వయ అధికారి డాక్టర్ సురేంద్రబాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణి మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.




క్షేత్రస్థాయి పరిశీలనతో వైద్య విద్యార్థినులు

ఎన్నికలకు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి - బిక్కవోలు

ంానంున్ల ఎన్నికలకు టిడిపి నాయకులు, కార్యర్తలు సమాయత్తం కావాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. బిక్కవోలులోని టిడిపి మండల కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం కోసం నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ రాబోయే ఎన్నికలకు సమయాత్తం కావాలన్నారు. బూత్‌లా వారీగా భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కుటుంబ సాధికార సారథులను ప్రతి 60 ఓటర్లకు ఒకరిని నియమించాలని సూచించారు. మండలాల వారీగా మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమం ద్వారా యువతతో ఇంట్రాక్ట్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

బిసిలకు పదవుల్లో ప్రాధాన్యత

రాజానగరం : పదవుల కేటాయింపులో బిసిలకు, మైనార్టీలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిన ఏకైక పార్టీ వైసిపి అని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. పలువురు బిసి నాయకులు, కార్యర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. వారికి కండువాలు వేసి రాజా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ రాజా మాట్లాడారు. బిసిలకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వెంకటస్వామినాయుడు, జడ్‌పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న, మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు కర్రి పాపారాయుడు, కె.దుర్గారావు, జి.సోమేశ్వరరావు, ఉండమట్ల రాజు, గంధం నారాయణరావు, కె.ప్రసాద్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గోకవరంలో వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం గ్రామంలో ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్లో ఎంపిపి సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి తోట నరసింహం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం పూర్తయిందన్నారు. గోకవరం మండలంలో ఈనెల 23న భారీ స్థాయిలో ఆసరా పథకం పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. గోకవరానికి సంబంధించి ఇళ్ల స్థలాల సమస్య ఉందన్నారు. తంటికొండ వెళ్లే దారి చెంతన స్థలంలో ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. భూసేకరణలో భాగంగా అక్కడ ఎనిమిది మంది రైతులకు ప్రభుత్వం నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ స్థలాల విషయమై కలెక్టర్‌ను కలిశామన్నారు. ప్రభుత్వం డబ్బులు విడుదలైన వెంటనే ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. గోకవరం మండలంలో డిగ్రీ కాలేజీకి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు తోట రాంజీ, వైసిపి నాయకులు సుంకర వీరబాబు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబివరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

ఉద్యోగ భద్రత కల్పించాలని రిలే దీక్ష

ప్రజాశక్తి - బిక్కవోలు

బలభద్రపురం శివారు కానేడు గ్రామంలో గల గ్లూకోజ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ప్రారంభించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్లూకోజ్ ఫ్యాక్టరీ కార్మికులు శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడారు. గుజరాత్‌కు చెందిన బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గ్రామంలో ఫ్యాక్టరీని నిర్మించిందన్నారు. ప్రస్తుతం సంస్థ యాజమాన్యం అక్రమ లే ఆఫ్ పేరుతో పరిశ్రమలో ఉత్పత్తిని నిలిపేసిందన్నారు. 30శాతం జీతం ఇస్తూ 80 రోజులుగా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈనెల 22 తరవాత పరిశ్రమను మూసేస్తామని చెప్పి కార్మికులన బయటకు పంపేసిందన్నారు. ఇతర రాష్ట్రం నుంచి కార్మికులను తీసుకొచ్చి ఫ్యాక్టరీలో పనిచేయించుకోవాలని చూస్తుందన్నారు. ఇది చాలా దారుణమన్నారు. తమకుప న్యాయం చేయాలని కోరారు. ఈ రిలే నిరాహార దీక్షకు ఆశా వర్కర్లు, అంగనవాడీలు మద్దతు తెలిపారు.



రిలే దీక్షల్లో కూర్చొన్న కార్మికులు, మద్దతుగా పాల్గొన్న అంగన్‌వాడీలు, ఆశాలు

నేరాలు ఘోరాలు

బాలికను వేధించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండలంలో ఓ మైనర్ బాలికను వేధిస్తున్న కేసులో కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన చొప్పల రవికుమార్ (నాని)ను శుక్రవారం అరెస్టు చేసి ఆలమూరు కోర్టుకు తరలించినట్లు అంగర ఎస్ఐ అందే పరదేశి తెలిపారు. ఈనెల 13న బస్సులో ప్రయాణిస్తున్న మైనర్ బాలికను ప్రేమించడం లేదని కోపంతో కొట్టి అవమానపరిచినట్లు బాలిక తన ఫిర్యాదులో పేర్కొంది. నిందితునికి ఆలమూరు కోర్టు జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

నిలువ చేసిన యానాం మద్యం ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పల్లంకూరు శివారు ముల్లేటి మొగ్గ గ్రామంలో ఓలేటి వీరబాబు 672 మద్యం బాటిల్స్ రవాణా చేసి అమ్మేందుకు సిద్ధపడ్డాడు పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఎఎస్ఐ విసత్యనారాయణ మరియు సిబ్బందితో ఆకస్మికంగా దాడులు చేశారు. వీరబాబుతో అరెస్ట్ చేసి బ్యాటిల్ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.66 వేలగా నిర్ధారించారు. వీరబాబును అరెస్టు చేసి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.
ఫోటో ఉంది వాడగలరు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామ శివారు పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని, వారి నుంఇచ రూ.25వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా, మద్యం, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భవన కార్మికునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్డిఒ కార్యాలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి పైన పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు చేదులూరి నాగు ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కిర్లంపూడి

కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన బీడీల పసుపులమ్మను తన భర్త వీరవరం గ్రామానికి చెందిన రమణ మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం తాగి వస్తున్నాడని వీరవరంలోని తమ నివాసంలో ఈ నెల మూడో తేదీన మందలించడంతో రాత్రి ఒంటిగంట సమయంలో వీరవరంలోని ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని కనిపించకుండా పోయినట్లు పసుపులమ్మ ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. ఆమె ఫిర్యాదు పై కిర్లంపూడి ఎస్సై కుమార్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సారా కేసులో మహిళ అరెస్టు

ప్రజాశక్తి- కడియం

మండలంలోని జేగురుపాడులో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సిఐ తులసీధర్ దెలిపారు. జేగురుపాడు శివాలయం సమీపంలో నాటు సారా అమ్ముతున్న జనిపల్లి సత్యవతిని అరెస్ట్ చేశామన్నారు. మండలంలో సారా విక్రయాలు, తయారీ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ లక్ష్మీప్రసన్నరెడ్డి

ఒలింపియాడ్‌లో సూర్యచంద్ర ప్రభంజనం

ప్రజాశక్తి - సీతానగరం

గతేడాది నవంబర్ నెలలో సిల్వర్ జోన్ ఫౌండేషన్ న్యూఢిల్లీ సంస్థ నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో సూర్య చంద్ర విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ పరీక్షల్లో 200 మంది పాల్గొన్నారు. 25 మంది గోల్డ్ మెడల్స్, 15 మంది సిల్వర్ మెడల్స్, 15 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. జోనల్ వైజ్, స్టేట్ వైజ్ టాపర్లుగా నిలిచి, లెవెల్ 2 కు ఎంపికయ్యారు. పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం సూర్య చంద్ర స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ కె.లక్ష్మీప్రసన్న రెడ్డి, చైర్మన్ జి.కనికిరెడ్డి చేతుల మీదుగా అభినందించారు. హెచ్ఎం సిహెచ్.ఫణీంద్రరావు, ఇన్‌ఛార్జి టి.రామకృష్ణ, ఎఒ సిహెచ్.సుమంత్ విద్యార్థులకు మెడల్స్, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కరస్పాండెంట్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఒలింపియాడ్ పరీక్షల్లో సూర్యచంద్ర విద్యార్థులు ప్రభంజనం చాటారన్నారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు విద్యార్థులు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఎడెక్స్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నన్నయ యూనివర్శిటీ అధికారులు, అధ్యాపకులు

యువతకు నైపుణ్యాభివృద్ధి మెరుగుదల కోసం కోర్సుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థ ఎడెక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి యూనివర్సిటీ విసిలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడెక్స్ కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు జి.సుధాకర్, బి.శ్రీనివాసు ఈ వివరాలను వెల్లడించారు. యువతకు విద్యాతో పాటు వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం అందించే క్రమంలో నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ డిగ్రీ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రభుత్వం నిర్వహి స్తుందన్నారు. అందులో భాగంగా 'ఎడెక్స్' సంస్థతో ఒప్పందం కుదిరిందన్నారు. నన్నయ యూనివర్శిటీ పరిధిలోని 400పైగా విద్యా సంస్థల్లో డిగ్రీ కళాశాలలో చివరి ఏడాది చదువుకుంటున్న సుమారు 50 వేల మందికి పైగా విద్యార్థులకు ఈ కోర్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. హార్వర్డ్, ఎంఐటి, కొలంబియా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, న్యూయార్క్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన యూనివర్శిటీలు రూపొందించిన కోర్సులను సులభంగా నేర్చుకునే వెసులుబాటు ప్రముఖ ఆన్ లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్' అందిస్తుందన్నారు. ఆ యూనివర్సిటీ వారే ఆన్ లైన్‌లో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ డీన్ పి.సురేష్‌వర్మ, ప్రిన్సిపల్ డి.జ్యోతిర్మయి, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కుమార్తె, అల్లుడితో కలిసి ఆవేదనన వ్యక్తం చేస్తున్న రత్నమ్మ

వైసిపి నాయకుని వేధింపుల నుంచి రక్షించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఎంఎల్ఎ పేరు చెప్పి స్థానిక వైసిపి నాయకుడు తన పొలం విషయంలో వేధింపులకు గురుచేస్తున్నాడని రామచంద్రపురం గ్రామానికి చెందిన గెడ్డం రత్నమ్మ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామంలోని అగ్రవర్ణానికి చెందిన చల్లమళ్ల సుజిరాజు భూమి విషయంలో పలు వివాదాలు సృష్టిస్తున్నాడని తెలిపారు. తన కుమారుడు, కుమార్తెకు ఆస్తిలో సమానంగా వాటా ఇచ్చానని వృద్ధురాలు పేర్కొంది. అయితే వైసిపి నాయకుడు తన కుమారుని పక్షాన చేరి నానా ఇబ్బందులు పెడుతున్నాడని వాపోయింది. కోర్టు ఆదేశాలున్నా ఎంఎల్ఎ పేరు చెప్పి ఎస్ఐతో అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని రత్నమ్మ, ఆమె అల్లుడు సామ్యూల్, కుమార్తె ఆవేదన వ్యక్తం చేశారు. భార్య జడ్పిటిసి కావడంతో, తన భార్య అధికారాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా దౌర్జన్యం చేశాడన్నారు. బిసి సర్పంచ్ దమ్ము వీరబాబుపై దాడి ఘటనలోనే సుజీరాజుపై కేసు ఉందన్నారు. తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

ఐఎస్‌టిఎస్‌లో 'సిద్ధార్థరాయ్' బృందం సందడి

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని తూర్పు గోనగుడెం సమీపంలో ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సిద్ధార్థ రాయ్ చిత్రం యూనిట్ సభ్యులు సందడి చేశారు. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ ఆధ్వర్యంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రం ప్రమోషన్ కోసం యూనిట్ సభ్యులు శుక్రవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హీరో దీపక్ సరోజ్, హీరోయిన్‌లు తన్వి, కీర్తనలు డ్యాన్స్ వేసి సందడి చేశారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. హీరో దీపక్ మాట్లాడుతూ చిత్రం మెత్తం వినోదాత్మకంగా ఉంటుందన్నారు. హాస్యంతో నిండిన ప్రేమ కథా చిత్రం అన్నారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే చిత్రం షూటింగ్ ఎక్కువగా జరిగిందన్నారు. మరో హీరోయిన్ కీర్తన మాట్లాడుతూ చిత్రం ఈనెల 23న విడుదల అవుతుందని విద్యార్థులందరూ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరావు, ఎఒ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న హీరో, హీరోయిన్లు



పోస్టుకార్డులను చూపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఒపిఎస్ కోసం పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి - చాగల్లు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని పోస్టు కార్డులు రాశారు. రానున్న ఎన్నికల్లో ఒపిఎస్‌పై స్పష్టమైన హామీ ఇచ్చి మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. అలాంటి పార్టీలకే తమ మద్దతు ఉంటుదని స్పష్టం చేశారు. ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో ఉద్యోగులు, ఉపాధ్యాయలు పోస్టుకార్డు ఉద్యమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పట్టా రవివర్మ కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహాధ్యక్షులు టి.సత్తిరాజు, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి, విడి.గంగాధర్, ఆదిబాబు, తన్వీర్, రమేష్‌బాబు, హరిప్రియ, గాయత్రి దేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి



మాట్లాడుతున్న డిఎస్‌పి రామారావు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారులు గుర్తించిన సమస్యాత్మక గ్రామాల్లో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తామని కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కొవ్వూరు డివిజన్ పరిధిలో సుమారు 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని తలెఇపారు. ఆయన వెంట కొవ్వూరు సిఐ శ్రీనివాసరావు, తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్, వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, సచివాలయ కార్యదర్శి నాగాంజనేయులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

2వ రోజుకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జెఎసి రాష్ట్ర పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎపి జెఎసి కన్వీనర్ ఎస్.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రాజబాబు ఆధ్వర్యంలో ధవళేశ్వరంలోని ఇరిగేషన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకూ నిరసనలు చేపడతామన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు బి.లక్ష్మణుడు, పి.శేషుకుమార్, ఆదిత్య, ఎం.సతీష్, సయ్యద్ బాజీ, శ్రీనివాసరాజు, ఎస్.వాసుదేవి, ఎ.సాయిరాం, షైనీ, వి.వెంకటేశ్వరరావు, డి.కృపారావు, రామభద్రరావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులంతా ప్రజలకు స్వచ్ఛమైన సేవలు అందించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన శుక్రవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు పనిచేయని అధికారుల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంఎల్ఎ వద్ద ఏకరువు పెట్టారు. ఇదిలా ఉండగా పలువురు అధికారులు గైర్హాజరవ్వడంపై ఎంఎల్ఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ ఎఇ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం లేదని సర్పంచులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంపిపి జొన్నకోటి పోసిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న ఆధ్వర్యంలో సుపరిపాలన : మంత్రి వనిత

ప్రజాశక్తి - గోపాలపురం

రాష్ట్రంలో జగనన్న ఆధ్వర్యంలో ప్రజలకు సుపరి పాలన అందుతుందని మంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం కరగపాడు, కొవ్వూరుపాడు, గుడ్డిగూడెం, రేగులకుంట గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు,నాయకులతో ఆమె సమావేశాలను నిర్వహించారు. స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గోపాలపురం-సాగిపాడు రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేస్తామన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. ఇతర రాష్ట్రాలు ఇక్కడున్న వాలంటీర్ వ్యవస్థను అమలు చేయాలని చూస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందజేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికలకు మోసపూరిత హామీలతో పసుపు, ఎరుపు రంగులు కలసి వస్తాయన్నారు. ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తున్న వైసిపిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

మెరుగైన శానిటేషన్ పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం 'స్వచ్ఛత మనందరి బాధ్యత' కార్యక్రమంలో భాగంగా కోలమూరు, కొంతమూరు, రాయుడు పాకల గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ఇంటింటా తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటూ డ్రెయినేజీ, పారిశుధ్యం నిర్వహణపై అధికారులకు పలు అదేశాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలో ఐదేళ్లలో స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో 15వ ఫైనాన్స్ సంఘం నిధులు లేమితో శానిటేషన్ లోపం కనబడుతోందన్నారు. వాటిని సమర్థ నాయకత్వం ద్వారా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. కోలమూరు, కొంతమూరు, రాయుడుపాకలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంఎల్‌సి కె.శ్రీనివాస్, కొంతమూరు సచివాలయం-1 కన్వీనర్ ఎం.గాబ్రియేల్, నాయకులు చెరుకూరి సత్తిబాబు, అత్తిలి భీమశంకరం, ఆనెం శ్రీను, షేక్ చానా తదితరులు పాల్గొన్నారు.

టిబి ముక్త్ పంచాయతీల పరిశీలన

ప్రజాశక్తి-గోకవరం, గోపాలపురం

మండలంలోని టిబి ముక్త్ పంచాయతీలను పరిశీలించామని జిల్లా పరిశీలనాధికారి డిఎన్ఎంఒ డాక్టర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో వెయ్యి జనాభాలో 30 మందికి కళ్లీ పరీక్షలు జరిపించాలన్నారు. వాటిలో 0 లేదా 1 కేసు నమోదు కావొచ్చన్నారు. ఆ ఒక్క కేసుకి, నిక్షయ్ పోషణ యోజన పథకంలో రూ.500 నిక్షయ్ మిత్ర పథకంలో న్యూట్రిషన్ కిట్ తీసుకొని, డ్రగ్ రెసిస్టెన్స్ టెస్ట్ చేయించుకొని ఉండాలన్నారు. అలాగే 2022లో నమోదైన కేసులన్నీ ట్రీట్మెంట్ పూర్తయి ఉండాలన్నారు. వీటిని పరిధిలోకి తీసుకొని ముక్త్ పంచాయతీలను ఎంపిక చేస్తారన్నారు. జిల్లాలో 300 పంచాయతీల్లో 109 పంచాయతీలు పరిశీలనకు వచ్చాయన్నారు. వాటిని జిల్లా పరిశీలన బృందం తనిఖీ చేస్తుందని తెలిపారు. గోకవరం మండలంలో గాదెలపాలెం, కామరాజుపేట పంచాయతీలను పరిశీలించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ ఆలేఖ్య, డాక్టర్ నిఖిత టిబి.సూపర్ వైజర్ శ్రీనివాస్, గాదెలపాలెం సర్పంచ్ కమ్మిల అచ్చిబాబు, కామరాజుపేట సర్పంచ్ అడపా వెంకటరావు హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు. 2025 సంవత్సరానికి క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు అన్నదవరపేట వైద్య అధికారి పి. స్వర్ణలత, మలకపల్లి వైద్యాధికారి అన్నపూర్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని చిట్యాలలో టీబీ యూనిట్ వైద్య బృందం పర్యటించింది. మండలంలో 16 పంచాయతీలు టిబి ముక్త్‌కు ఎంపికయ్యాయన్నారు.